సొంతింటి ఆశలపై ఆంక్షలు

- మార్చిలోగా పూర్తి చేయాలని షరతులు
- ప్రభుత్వ ఆర్భాటం కోసం సామాన్యులపై ఒత్తిడి
- ఆందోళనలో లబ్ధిదారులు


కొలిమిగుండ్ల జగనన్న కాలనీలోని నివాసాలు


తుమ్మలపెంట లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

కొలిమిగుండ్ల: ఇళ్లులేని నిరుపేదలు ఉండకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు విలువైన ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. భవిష్యత్‌లో ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు పట్టాలు అందజేసింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే షరతులు విధించి లబ్ధిదారుల సొంతింటి ఆశలపై ఆంక్షలు విధిస్తోంది. బేస్‌లెవల్ ఉన్న నిర్మాణాలను మార్చిలోగా, గోడలు, స్లాబ్ దశల్లో ఉన్నవి డిసెంబర్ చివరి నాటికి తప్పక పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడం లబ్ధిదారుల గుండెల్లో గుబులు లేపుతున్నారు. కాలనీల్లో ఇంటి పట్టాలు అందుకున్న కొంత మంది అనివార్య కారణాలతో బేస్‌లెవల్ వరకు నిర్మాణాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జగనన్న కాలనీల్లోని లబ్ధిదారుల పరిస్థితి అయోమయంగా మారుతోంది. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 5975 మంది గృహాలు మంజూరు కాగా నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా రూ.1.80 లక్షలు ఆర్థిక సాయంతో పాటు డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35వేలు బ్యాంక్‌ల్లో రుణం ఇచ్చేలా తీసుకున్నారు. గతంలో లేఅవుట్ల ఏర్పాటులో జాప్యం, లబ్ధిదారులు సకాలంలో ముందుకు రాకపోవడంతో ఇళ్ల నిర్మాణంలో ఆలస్యం చోటు చేసుకుంది.

లబ్ధిదారులపై ఒత్తిడి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల కోసం ప్రైవేట్ వెంచర్లను తలపించేలా లేఅవుట్లు వేసి ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. విశాలమైన రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఇళ్ల నిర్మాణాలపై ఆంక్షలు విధిస్తోంది. వచ్చే ఏడాది మార్చిలోగా అన్ని రకాల నిర్మాణాలు పూర్తి కాకపోతే రద్దు చేస్తామని పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తుండడంతో లబ్ధిదారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ప్రస్తుతం ఇసుక, స్టీలు, కూలీల ఖర్చులు భారీగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు అవుతున్నా కొత్త ఇళ్ల కోసం నేటికీ వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులను ప్రోత్సహించకుండా మన ఇల్లు–మన గౌరవం పేరుతో హంగామా చేస్తున్నారు.

నియోజకవర్గంలో మంజూరైన ఇళ్ల వివరాలు

మండలం	మంజూరైన గృహాలు	వివిధ దశల్లో ఉన్న ఇళ్లు
కొలిమిగుండ్ల	1304	643
బనగానపల్లె	1528	406
సంజామల	1241	407
కోవెలకుంట్ల	1492	891
అవుకు	410	104

బిల్లుల సమస్య లేదు

ఇళ్ల నిర్మాణాలు చేసుకునే లబ్ధిదారులకు బిల్లుల సమస్య లేదు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే కొంత మంది నిర్మాణాలను మధ్యలో ఆపేశారు. వారంతా పూర్తి చేసేలా ప్రోత్సహిస్తున్నాం. మార్చిలోగా నిర్మాణాలు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి పోయే ప్రమాదముంది. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి.

– మద్దిలేటి, హౌసింగ్ ఏఈ

క్లుప్తంగా

మెరుగైన వైద్యసేవలందించాలి


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కాంతారావునాయక్

కోవెలకుంట్ల: వివిధ జబ్బులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ సూచించారు. సోమవారం రేవనూరు పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న మందులు, అందుతున్న వైద్యసేవలపై డాక్టర్ విద్యాసాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని గుండుపాపల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. ఆయన వెంట డాక్టర్ మహబూబ్‌సుభాని, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, గిరిజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి


వీఆర్వోలతో సమీక్షిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: రెవెన్యూ రికార్డులను వీఆర్వోలు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ పవన్ కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ సమస్యలు తలెత్తకుండా రికార్డులను పకడ్బందీగా ఉంచుకోవాలని తెలిపారు. మంగళవారం నుంచి మండలంలోని నాలుగు గ్రామాల్లో రీసర్వేకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఏవైనా భూ సమస్యలు ఉంటే గ్రామసభ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో విశేష పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధి హెచ్.కొట్టాల గ్రామ సమీపంలోని ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానికులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ


ఆలయ ప్రాకారంలో స్వామివారిని ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను కనుల పండువగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు స్వామివారి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కథల పోటీల్లో రాచర్ల విద్యార్థిని ప్రతిభ


ఐశ్వర్య

ప్యాపిలి: రాచర్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఐశ్వర్య కథల పోటీల్లో ప్రతిభ చాటుకుంది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో ఐశ్వర్య రచించిన 'జలమా..గరళమా' అనే కథ బహుమతికి ఎంపికైనట్లు హెచ్ఎం ఉమాదేవి సోమవారం తెలిపారు. పాఠశాలలో గతంలో పనిచేసిన హెచ్ఎం తొగట సురేష్ బాబు ప్రోత్సాహంతో ఐశ్వర్య కథా రచనలను ప్రారంభించినట్లు హెచ్ఎం తెలిపారు. నవంబర్ 3వ తేదీ హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు ఐశ్వర్యకు నగదు బహుమతి, పుస్తక బహుమానం, జ్ఞాపికతో సత్కరిస్తారని తెలిపారు. దీనిపై హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు శేషయ్య, లక్ష్మానాయక్, విజయలక్ష్మి, ఫరీదాబేగం, షకీలా బేగం, జీవలత హర్షం వ్యక్తం చేశారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు పొడిగింపు

బనగానపల్లె రూరల్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమశాఖ ద్వారా ఇచ్చే ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు బనగానపల్లె సహాయ సాంఘీకశాఖ అధికారి రాముడు తెలిపారు. ఎస్జీటీలకు ఇంటర్‌తో పాటు డైట్‌సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు http://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం మూడు నెలల పాటు ఉచిత బోధన, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు.

సీహెచ్‌సీలో అన్నదానం


రోగులకు అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో గర్భిణులు, రోగులు, వారి సహాయకులకు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, రాజు సోమవారం అన్నదానం చేశారు. పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని వైద్యుడు చరణ్ రాజు కొనియాడారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి, వలీబాషా, సభ్యులు మనోహర్‌రెడ్డి, పెద్ద కేశాలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

డోన్ టౌన్: ఆన్‌లైన్ మోసాలు, తెలియని లింక్‌లు, సోషల్ మీడియాలో కొత్త వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని సాయిశ్రీ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఉమెన్ సేఫ్టీ యాప్ ఉపయోగాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ఆసరాతో అధిక మోసాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ముఖ్యంగా మహిళలు అధిక శాతం మోసపోతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం తెలపరాదని సూచించారు. సైబర్ క్రైంకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని.. వాటి వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. బాల్య వివాహాలపై 1098, అత్యవసర పరిస్థితుల సమయంలో 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల: తిమ్మనాయునిపేట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. సంజామల మండలం గిద్దలూరుకు చెందిన రాజు మరో వ్యక్తితో కలిసి తాడిపత్రికి వెళ్లాడు. పని ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యలోని తిమ్మనాయునిపేట సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతల వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. వెనుక కూర్చున్న రాజు కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి


లోకేష్ కుమార్ (ఫైల్)

బేతంచెర్ల: తండ్రి మందలించాడని ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని గూటుపల్లె గ్రామానికి చెందిన చాకలి రామసుబ్బయ్య, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు చాకలి లోకేష్ కుమార్(21) బేతంచర్లలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సరిగ్గా వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన లోకేష్ కుమార్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు ఎదుర్కొంటేనే రాణించగలం


విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: సమస్యలను ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే జీవితంలో రాణించగలుగుతారని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. సోమవారం పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని పరిస్థితులు, సౌకర్యాలు, వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత, శానిటేషన్, ఇరుకు గదుల సమస్య ఉన్నట్లు నిర్వాహకురాలు కరుణ లత జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాలికలు బాగా చదువుకుని స్వశక్తితో బతికేలా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

అమరవీరుల సేవలు చిరస్మరణీయం


డోన్: మౌనం పాటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


కోవెలకుంట్ల: సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళి

డోన్ టౌన్: అమరవీరుల త్యాగాలు మరువకూడదని హెచ్ఎం పద్మావతి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో అమరు వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాల పాటు విద్యార్థులతో కలిసి మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి సైనిక, పోలీస్ అమరవీరుల గురించి వివరించారు. అలాగే ఆల్ఫ్రెడ్ నోబుల్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, లక్ష్మయ్య, రఘునాథ్, ఎస్తేరమ్మ, మద్దిలేటి, సుబ్బరాయుడు, సురేష్, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, శివన్న, జయసుబ్బరాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

- కోవెలకుంట్ల: విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాలని రిటైర్డ్ లైబ్రేరియన్, ప్రకృతి పీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని వెలగటూరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ ఎస్ఐ సుధాకర్‌రెడ్డి 11 నెలల క్రితం వీరమరణం పొందారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామానికి చేరుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుధాకర్‌రెడ్డి దేశసేవ కోసం ప్రాణాలర్పించారని సేవలను కొనియాడారు. ప్రజా సంఘాల నాయకులు రఘు, నరసింహులు, మహేశ్వరరెడ్డి, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్.లింగందిన్నెలో ఆధార్ క్యాంప్

సంజామల: మండల పరిధిలోని ఆర్.లింగందిన్నె గ్రామంలో మంగళవారం ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. సచివాలయ పరిధిలోని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి గ్రామ సభలు

బనగానపల్లె రూరల్: మండలంలో మంగళవారం నుంచి నవంబర్ 14వ తేదీ వరకు గ్రామ సభలు జరగనున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. గతంలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 22న అప్పలాపురం, 23న బీరవోలు, 24న బత్తులూరుపాడు, 25న చెరువుపల్లె, 26న యనకండ్ల, 29న జంబులదిన్నె, 30న జిల్లెల్ల, నవంబరు 1న జ్వాలాపురం, 2న కాపుపల్లె, 5న మీరాపురం, 6న మిట్టపల్లి, 7న నిలువుగండ్ల, 8న పండ్లాపురం, 12న పాతపాడు, 13న సంకలాపురం, 14న వెంకటాపురం, విశలాపురం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో భూ సర్వేలో వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

- డోన్ రూరల్: మండలంలో ఈ నెల 22న కామగానికుంట్ల, 23న కొత్తబురుజు, 24న కొత్తకోట, 25న ఎస్.గుండాల, 26వ తేదీలో ఎస్.వలసలలో గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ నాగమణి తెలిపారు. గ్రామస్తులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.
- అవుకు: రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సువర్ణాదేవి అన్నారు. ఈ నెల 22వ తేదీ అన్నవరం, 23న చెన్నంపల్లె, 24న చెర్లోపల్లె, 25న మెట్టుపల్లె, 26న నిచ్చెనమెట్ల, 29న శింగనపల్లె, 30న శివవరం, నవంబర్ 1వ తేదీ వేములపాడులో గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఈ సభలకు మండల రెవెన్యూ అధికారితో పాటు సర్వేయర్, వీఆర్వో హాజరవుతారని తెలిపారు.
- సంజామల: భూసమస్యలపై మంగళవారం నుంచి జరిగే గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ అనీల్ కుమార్ తెలిపారు. 22న దత్తపురం, 23న ఎగ్గోని, 24న మంగపల్లె, 25న మిక్కినేనిపల్లె, 26న ముచ్చలపురి, 29న ముక్కమల్ల, 30న నట్లకొత్తూరు, నవంబర్ 1న రామభద్రుని పల్లె, 2న వసంతాపురం గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.
- ప్యాపిలి: ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 22వ తేదీ జక్కసానికుంట్ల, 23న మాధవరం, 24న నేరేడుచెర్ల, 25న ఎస్ రంగాపురం, 26న ఎస్ రాయంపేట, 29వ తేదీ వెంగళాంపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభలు జరుగుతాయన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


స్టాల్‌ను పరిశీలిస్తున్న ఏఓ సుబ్బారెడ్డి

బనగానపల్లె రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఆకుకూరలు, మునగ, చిలకడ దుంపల విక్రయ స్టాల్‌ను ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి రసాయన మందులను వినియోగించకుండా కేవలం ప్రకృతిలో లభించే పేడ తదితర వ్యర్థాల ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలు ప్రతి రోజు ఆహారంలో తీసుకోవడం వల్ల ఎలాంటి జబ్బులు రావన్నారు. ఈ పంటల సాగుకు పెట్టుబడి తక్కువ.. ఆదాయం గిట్టుబాటుగా ఉంటుందని సూచించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది రామచంద్రుడు, సుధాకర్, లత, నాగసుప్రజా, సుధామణి, రాంమద్దిలేటి, విశ్వనాథ్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె



బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి చాకలి మద్దిలేటికి చెందిన మట్టి మిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ధోబీ పనిచేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

గుంతలు ఉన్నాయ్ జాగ్రత్త!


గుంత వద్ద హెచ్చరిక కోసం ఏర్పాటు చేసిన ఎర్రని వస్త్రం

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామ సమీపంలో పాలేరు వాగు వంతెనపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులను అప్రమత్తం చేయడానికి ఎర్రని గుడ్డను గుర్తుగా ఉంచారు. 900 మీటర్ల పొడవు గల వంతెనపై గోతులు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు మరింత లోతుగా మారాయి. రాత్రి ప్రయాణించే వాహనాదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గత వారం వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో తహసీల్దార్ అనీల్‌కుమార్, ఆర్అండ్‌బీ ఏఈ రెడ్డి గోవింద్ పరిశీలించారు. గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకుంటామని చెప్పినా ఇప్పటి వరకు పురోగతి లేదు.

పరీక్షల నిర్వహణలో గందరగోళం తగదు



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్

బేతంచెర్ల: నిర్మాణాత్మక పరీక్షల నిర్వహణలో గందరగోళాన్ని నివారించాలని ఎస్టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అజాంబేగ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మారినా విద్యాశాఖ అధికారుల తీరులో మార్పులేదన్నారు. నిర్మాణాత్మక పరీక్షల విషయంలో కేవలం 15 నిమిషాల వ్యవధిలో రెండు పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకుని ప్రశ్నల రూపకల్పనలో సమతుల్యత పాటించి, ఉదయం, మధ్యాహ్నం ఒక్కో పరీక్ష చొప్పున నిర్వహించి గందరగోళాన్ని నివారించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్, సభ్యులు పుల్లయ్య, చెన్నప్పరెడ్డి, సుబ్బారెడ్డి, మల్లేశ్వరుడు, బాల మద్దిరాజు, ధనుంజయ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

జీవాలకు నట్టల వ్యాధి నివారణ మందు


జీవాలకు ద్రావణాన్ని తాపిస్తున్న పశువైద్యులు

డోన్: వర్షాకాలంలో గొర్రెలు, మేకలు పచ్చిక బయళ్లను మేయడం వల్ల వాటిపై ఉండే పరాన్నజీవుల వల్ల జీవాల పొట్టల్లో నట్టల వ్యాధి వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని పశువైద్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని లక్షుంపల్లె గ్రామంలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా పశువైద్య శాఖ అధికారులు హుసేన్‌బాషా, కళ్యాణి, రామాంజనేయులుతో కలిసి గొర్రెలు, మేకలకు వ్యాధినివారణ కోసం ద్రావకాన్ని తాపించారు. పెంపకందారులు గొర్రెలు, మేకల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో 2500 జీవాలకు ద్రావణాన్ని తాపించడం జరిగిందని పేర్కొన్నారు.